రంజాన్ వేళలు

ఇఫ్తార్ (బుధ)	సా.6.24
సహరీ (గురు)	ఉ.4.39

ఎండా కాలమ్

	గరిష్ఠం	కనిష్ఠం
అమలాపురం	35	26



లంకాఫ్ రాణేలంకలో కోతకు గురవుతున్న భూమి

'వారంలో అంచనాలు రూపొందించి టెండర్ల ప్రక్రియ పూర్తి చేస్తారు... మరో 20 రోజుల్లో పనులు ప్రారంభమవుతాయి. ఇక్కడ జరిగే పనుల ప్రగతిని కలెక్టర్ ఫొటోలు తీసి నాకు అప్‌లోడ్ చేస్తారు...' గత ఏడాది వరదల సమయంలో లంక గ్రామాల పర్యటనకు విచ్చేసిన సందర్భంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలివి. అయితే ఇప్పటికి ఏడు నెలలు గడిచినా అక్కడ పనులు చేపట్టిన దాఖలాలు లేవు. వరదలు వచ్చినప్పుడల్లా గోదావరి నదీ ప్రవాహ ఉధృతికి విలువైన లంక భూములు కోతకు గురవుతున్నాయి.

అన్నీ కోతలే!

- గోదాట్లో సీఎం జగన్ హామీలు
- నదీపాతానికి గురవుతున్న లంక భూములు
- రూ.150 కోట్లతో రివిట్‌మెంట్, గ్రోయిన్లు నిర్మిస్తామని గతేడాది ఆగస్టు 8న జగన్ హామీ
- ఆర్భాటపు ప్రకటనే తప్ప అంచనాలు లేవు... టెండర్ల ప్రక్రియ అంతకన్నా లేదు
- పనులకు దిక్కూమొక్కూ లేదంటున్న లంక వాసులు

ముమ్మిడివరం, మార్చి 26: కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం కమిని పంచాయితీ పరిధిలోని సలాదివారిపాలెం, వలసలతిప్ప, గురజాపులంక, లంకాఫ్ రాణేలంక పంచాయతీ పరిధిలోని కూనాలంక, లంకాఫ్ రాణేలంకల్లో సుమారు 1,500 ఎకరాలు నదీపాతమైంది. దేవాలయాలు, మంచినీటిబావులు, మండువా ఇళ్లు, పాఠశాలలు, పంచాయతీ భవనాలు సైతం నదీ గర్భంలో కలిసిపోయాయి. వీటితో పాటు లంక వాసులకు ఉపాధినిచ్చే విలువైన సారవంతమైన భూములు నదీపాతమయ్యాయి. గత ఏడాది జూలైలో వరదలు ముంచెత్తాయి. ముమ్మిడివరం, అయినవిల్లి మండలాల్లోని లంక గ్రామాల్లో వరద బాధితులను పరామర్శించడానికి గతేడాది ఆగస్టు 8న సీఎం జగన్ వచ్చారు. ముమ్మిడివరం, అయినవిల్లి మండలాలకు చెందిన లంకవాసులు, వరద బాధితులు భూముల నదీకోత విషయాన్ని సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన రూ.150 కోట్లతో నదీ కోత నివారణకు మూడు కిలోమీటర్ల మేర రివిట్‌మెంట్, గ్రోయిన్ల నిర్మాణం చేపడతామన్నారు. ఆ నిధులు సరిపోకపోతే మరో రూ.50 కోట్లు ఖర్చు చేయడానికైనా వెనుకాడబోమని లంక వాసులకు భరోసా ఇచ్చారు. ఆ పనులకు అంచనాలు రూపొందించాల్సిందిగా అక్కడ ఉన్న ఇంజనీరింగ్ ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పనులు ప్రారంభమైన వెంటనే ఆ ప్రగతిని ఎప్పటికప్పుడు ఫొటోల రూపంలో తనకు నివేదించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. కమిని పంచాయతీ పరిధి గురజాపులంకలో 600 మీటర్లు, లంకాఫ్ రాణేలంక పంచాయతీ పరిధి కూనాలంకలో 800 మీటర్లు, లంకాఫ్ రాణేలంకలో 400 మీటర్లు, పళ్లవారిపాలెం వివేకానంద వారధి వద్ద 300 మీటర్లు, అయినవిల్లి మండలం కొండుకుదురులంక వద్ద 600 మీటర్లు, పొట్టిలంకలో వెయ్యి మీటర్ల మేర రక్షణ చర్యలు చేపడతామని ముఖ్యమంత్రి ప్రకటించారు. ఆగస్టు నెలలో అంచనాలు, టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి సెప్టెంబరు నెలాఖరు నాటికి పనులు ప్రారంభించేలా ఆదేశాలు జారీ చేశారు. అయితే ఇప్పటి వరకు అంచనాలు రూపొందించడం గానీ, టెండర్ల ప్రక్రియగానీ పూర్తి కాలేదు. సీఎం ఎంతో ఆర్భాటంగా ప్రకటించిన పనులకే దిక్కూమొక్కూ లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎన్నికల నగారా మోగడంతో ఆ పనులపై నమ్మకం పూర్తిగా సన్నగిల్లిందంటున్నారు.



ముమ్మిడివరం మండలం గురజాపులంకలో కోతకు గురవుతున్న భూమి



గోదావరి ఒడిలో కలిసిపోతున్న కొబ్బరిచెట్టు



కూనాలంకలో కోతకు గురవుతున్న భూమి



అయినవిల్లి మండలం కొండుకుదురు లంకలో కోతకు గురవుతున్న భూమి



పళ్లవారిపాలెంలో వివేకానంద వారధి వద్ద కోతకు గురవుతున్న భూమి

ఎంతో ఆనందించాం.. నిరాశే మిగిలింది



గోదశి పుండరీష్, లంకాఫ్ రాణేలంక

నదీ కోత నివారణకు రక్షణ చర్యలు చేపడతారంటే ఎంతో ఆనందపడ్డాం. పనులు చేపట్టకపోవడంతో మాకు నిరాశే మిగిలింది. వివేకానంద వారధి వద్ద లంకవైపు భూమి కోతకు గురవుతోంది. అది కొంచెం పెరిగితే ఆ వారధి ఉనికికే ప్రమాదం జరగవచ్చు. వారధి దెబ్బతింటే మళ్లీ నిర్మాణం సాధ్యమయ్యే పని కాదు. విలువైన లంక భూములు, ఇళ్లు, పాఠశాలలు, దేవాలయాలు సైతం నదీ గర్భంలో కలిసిపోతున్నాయి.

నీటి మీద రాతలాగే మిగిలింది



సుంకర అయ్యన్న, సలాదివారిపాలెం

ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ నీటి మీద రాతలాగే మిగిలింది. నదీకోత నివారణకు రక్షణ చర్యలు చేపట్టకపోతే భవిష్యత్తులో లంక గ్రామాలు కనుమరుగయ్యే ప్రమాదం పొంచిఉంది. ఇప్పటికే విలువైన భూములు, కట్టడాలు నదీపాతమయ్యాయి. ఎన్నికల తర్వాత వచ్చే కొత్త ప్రభుత్వమైనా లంక భూములకు రక్షణ చర్యలపై దృష్టి పెట్టాలి.



వీవీ ప్యాట్ల పనితీరును పరిశీలిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

ఈవీఎంలపై అపోహలు తొలగించేందుకే...

వీవీ ప్యాట్లపై ఓటు ఎవరికి వేశామో చూసుకునే అవకాశం: కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఈవీఎం యంత్రాలపై వున్న అపోహలను తొలగించేందుకు భారత ఎన్నికల సంఘం ఓటరు వెరిఫైబుల్ పేపర్ ఆడిటర్ ట్రయల్ (వీవీ ప్యాట్లు) అందుబాటులోకి తెచ్చిందని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. ఈ విధానం ద్వారా ఏడు సెకన్ల పాటు ఓటరు ఎవరికి ఓటు వేసిందీ చూసుకునే అవకాశం లభిస్తుందన్నారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో మంగళవారం 21 శాఖలకు సంబంధించి ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు సాధారణ ఎన్నికలు-2024కు సంబంధించి పోలింగ్ ప్రక్రియ నిర్వహణ తీరుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ, అవగాహన సదస్సు నిర్వహించారు. కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ తీరుపట్ల ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. పోలింగ్ రోజుకు ముందు రోజు రిసెప్షన్ సెంటర్‌కు పోలింగ్ సిబ్బంది హాజరై ముఖ్యమైన ఎన్నికల సామగ్రి 56 అంశాలకు సంబంధించిన వాటిని సరిచూసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రం చుట్టూ వంద మీటర్ల పరిధిలో ఎటువంటి ప్రచార కార్యక్రమాలు, బ్యానర్లు, జెండాలు లేకుండా వీఆర్వో సహాయంతో మార్కింగ్ చేపట్టాలన్నారు. పోలింగ్ నిర్వహణలో తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. పోలింగ్ రోజున ఉదయం 5.30 గంటలకు సిబ్బంది సిద్ధం కావాలని, పోలింగ్‌కు 90 నిమిషాలముందు పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ 50 ఓట్లతో నిర్వహించి ఈవీఎంల పనితీరును పరిశీలించాలన్నారు. ఉదయం ఏడు గంటలకే పోలింగ్ ప్రక్రియను ప్రారంభించాలన్నారు. వెబ్ కాస్టింగ్ చిత్రీకరణతో పోలింగ్ ప్రక్రియ నిర్వహిస్తారన్నారు. 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఒక కార్డును ధ్రువీకరించి ఓటరును ఓటింగ్‌కు అనుమతించాలన్నారు. లోక్‌సభకు తెలుపు, అసెంబ్లీకి పింక్ కలర్ బ్యాలెట్ స్లిప్పులను జారీచేసే విధానంతో పాటు పలు అంశాలపై అవగాహన కల్పించారు. పోటీలో ఉన్న అభ్యర్థులు 16 మంది దాటితే రెండో బ్యాలెట్ యూనిట్ వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పోలింగ్‌కు వారం ముందుగా అత్యవసర సర్వీసులు, పోలింగ్ నిర్వహణలో ఉన్న ఉద్యోగులు, ఎన్నికల మీడియా కవరేజ్‌లో నిమగ్నమైన గుర్తింపు పొందిన పాత్రికేయులు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలన్నారు. డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, సీపీవో వెంకటేశ్వర్లు ఓటింగ్ విధానాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈవీఎంల డెమోను మాస్టర్ ట్రైనీ ప్రకాష్ తదితరులు నిర్వహించారు.

ఎన్నికల నిబంధనావళి అమలులో ఉండగా..

మద్యం విక్రయాలు 30శాతం పెరిగితే ఆయా దుకాణాలపై నిఘా

అమలాపురం టౌన్, మార్చి 26: ఎన్నికల నిబంధనావళి అమలులో ఉన్న సమయంలో మద్యం విక్రయాలు 30శాతం పెరిగితే సంబంధిత దుకాణాలను గుర్తించి వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. విక్రయాలు పెరిగిన దుకాణాలపై విచారణ చేపట్టాలన్నారు. అక్రమ మద్యం, గంజాయి, సొమ్ముల తరలింపు రవాణా అంశాలపై పక్కాగా దృష్టి సారించాలన్నారు. ఓటర్లను ప్రలోభ పెట్టే తాయిలాల పంపిణీని అధికారులు అరికట్టాలన్నారు. ఎన్నికల సీజన్ మేనేజ్‌మెంట్ విధానంపై ఎన్నికల నోడల్ అధికారి ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. జిల్లా సరిహద్దులు, చెక్‌పోస్టుల వద్ద ముమ్మర తనిఖీలు చేయాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, స్టాటస్టికల్ సర్వే లెన్స్ బృందాలు తనిఖీలు మరింతగా చేసి నిఘా వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. ముందస్తు అనుమతులు లేకుండా రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఇంటింటా ప్రచారాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. రైళ్లు, ఆర్టీసీ బస్సుల్లో తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. పోలీసు బలగాల పనితీరు, సీజ్ చేసిన అంశాలపై ఎన్నికల ప్రవర్తనా నియమావళికి అనుగుణంగా చర్యలు వేగవంతం చేయాలన్నారు. కోడ్ ఉల్లంఘనపై దృష్టి పెట్టి కేసులు నమోదు చేయాలన్నారు. ఎన్నికల విధుల్లో అలసత్వం, నిర్లక్ష్యం వహించే అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

రేపటి నుంచి ఇంటర్ ఐదో విడత మూల్యాంకనం

అమలాపురం టౌన్, మార్చి 26: ఇంటర్మీడియట్ ఐదో విడత పరీక్షా పత్రాల మూల్యాంకనాన్ని గురువారం నుంచి నిర్వహిస్తున్నట్టు జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖ అధికారి వనుము సోమశేఖరరావు తెలిపారు. ఇంటర్ మూల్యాంకనాన్ని ఈ నెల 9న అమలాపురం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ప్రారంభించామన్నారు. ఐదో విడతలో వృక్ష, జంతు శాస్త్రం, వాణిజ్య శాస్త్రం పరీక్షా పత్రాల మూల్యాంకనం జరుగుతుందని... ఇది ఏప్రిల్ 4న ముగుస్తుందన్నారు. ఇంటర్మీడియట్ బోర్డ్ నియమించిన అసిస్టెంట్ ఎగ్జామినర్లు, చీఫ్ ఎగ్జామినర్లను సంబంధిత ప్రిన్సిపాల్స్ విధుల నుంచి రిలీవ్ చేసి స్పాట్ వాల్యుయేషన్ క్యాంపునకు పంపించాలని సోమశేఖరరావు కోరారు.

వేసవి క్రీడా శిక్షణా శిబిరాల నిర్వహణకు దరఖాస్తుల ఆహ్వానం

అమలాపురం టౌన్, మార్చి 26: జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో బాల, బాలికలకు వేసవి క్రీడా శిక్షణా శిబిరాలకు రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాలు జారీ చేసిందని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి పీఎస్ సురేష్‌కుమార్ తెలిపారు. జిల్లాలో మే 1 నుంచి 31వ తేదీ వరకు వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు నిర్వహిస్తారు. ఆసక్తి గల వివిధ క్రీడల జిల్లా అసోసియేషన్లు, వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులు తమ దరఖాస్తులను పూర్తి వివరాలతో ఈ నెల 30వ తేదీలోపు అమలాపురం జీఎంసీ బాలయోగి స్టేడియంలో ఉన్న జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయంలో అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు 7993329433 నెంబరులో సంప్రదించాలన్నారు.

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడిగా రెడ్డి సుబ్రహ్మణ్యం ...7లో



పేరాయిచెరువు శివారులో ఎండుతున్న పంట పొలం



ఆదిలక్ష్మీపురంలో బీటలు వారిన పొలం



అడుగంటిన లక్ష్మీవాడ-వాడపల్రు పంట కాల్వ

కొన ఊపిరిలో దాళ్వా చేలు

- వంతులో కూడా దొరకని నీటి చుక్క
- డ్యామ్ తలుపు దెబ్బతిన్నా పట్టించుకోని వైనం
- నీటి కోసం నోళ్లు తెరుస్తున్న శివారు పొలాలు
- రైతుల కన్నీటి గోడు పట్టదా!

ఉప్పలగుప్తం, మార్చి 26: రైతుల సంక్షేమం మాటల వరకే.. అత్యవసర సమయంలో వారి గోడు పట్టించుకునే వారేరీ... ప్రజాప్రతినిధులు ఎన్నికల హడావిడిలో ఉన్నారు. రైతు సంఘాలు ఎలాగూ లేవు. నీటి వినియోగదారుల సంఘాలకు ఎప్పుడో స్వస్తి పలికారు. ఇరిగేషన్ అధికారులు అంతంతమాత్రంగానే స్పందిస్తారు. ఒకపక్క దాళ్వాకు సమయం మించిపోతోంది. సమయానికి సాగునీరందకపోతే మొత్తం పెట్టుబడి మట్టిలో కలిసినట్టే.. అయినా ఈ దాళ్వా సీజన్లో అన్ని విభాగాల నుంచి రైతులకు సహాయ నిరాకరణ జరిగిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నీటి ఎద్దడి కారణంగా దాళ్వాలో అయినాపురం సెక్షన్ పరిధిలోని పంటకాల్వలకు నెలకు మూడుసార్లు వంతుల వారీగా నీటిని విడుదల చేస్తున్నారు. అయితే వంతు రోజుల్లో ఆయా కాల్వల శివారు వరకు నీరు అందుతుందో లేదో అధికారులు పట్టించుకోవట్లేదు. లేదు. మధ్యలో నీటిని ఎలా దుర్వినియోగం చేస్తున్నారో తెలిసినా అధికారులు పట్టనట్టుగానే ఉంటున్నారు. దీంతో లక్ష్మీవాడ-వాడపల్రు, ఉప్పలగుప్తం-పేరాయిచెరువు కాల్వల శివారు ఆయకట్టుకు వంతు రోజుల్లో సైతం అన్యాయం జరుగుతోంది. వంతుత రోజుల్లో అజమాయిషీ లోపించడంతో శివారు ప్రాంతాల పొలాలు బీటలు వారుతున్నాయి. లక్ష్మీవాడ-వాడపల్రు పంటకాల్వ డ్యామ్ ఎగువున నంగవరం కాల్వ ఉంది. నాలుగు రోజుల క్రితం నంగవరం కాల్వ డ్యామ్ తలుపు దెబ్బతినడంతో మొత్తం నీరంతా నంగవరం కాల్వకు ప్రవహించింది. దీంతో వంతు రోజుల్లో కూడా లక్ష్మీవాడ-వాడపల్రు పంట కాల్వకు నీటి కష్టాలు తప్పలేదు. నంగవరం డ్యామ్ తలుపు మరమ్మతులు చేసేందుకు ఇరిగేషన్ సిబ్బంది ప్రయత్నించకపోవడం గమనార్హం. పైరుకు ఊపిరి పోసేందుకు రైతులే డ్యామ్ తలుపును బాగుచేయించుకున్నారంటే రైతులంటే ప్రభుత్వానికి ఎంత ప్రేమో అర్థమవుతోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏది ఏమైనా ప్రస్తుతం పైరు పూర్తిస్థాయిలో ఈనిక జరగాలన్నా, ఈనిన చేలల్లో గింజల్లో నాణ్యత ఉండాలన్నా అత్యవసరంగా పొలాలకు సాగునీరు అందించాల్సిందే

ఎండిపోతున్న చేలకు నీరడిగితే మండిపడుతున్నారు

సలాది శ్రీనివాసరావు, రైతు, ఉప్పలగుప్తం

దాళ్వా నాట్లు వేసింది మొదలు సాగునీటికి ఇబ్బందులు పడుతూనే ఉన్నాం. వంతు రోజుల్లో కూడా శివారుకు నీరందడం లేదు. తోడుకుందామన్నా కాల్వలో నీరులేకపోతే మా గతి ఏమిటి? ఇరిగేషన్ అధికారిని అడిగితే కోపంగా సమాధానం ఇస్తున్నారు. పంట చివరి దశలో నీరివ్వకపోతే మొత్తం పెట్టుబడి నష్టపోతాం. సమయం మించిపోతోంది. రైతులపై దయ చూపించండి.

ఎవరికి మొరపెట్టుకున్నా ఫలితం కనిపించట్లేదు

పెయ్యల చిట్టిబాబు, నీటి సంఘం మాజీ డైరెక్టర్, పేరాయిచెరువు

ఈ ఏడాది దాళ్వాకు అనుభవించిన సాగునీటి కష్టాలు గతంలో ఎన్నడూ లేవు. ఎవరికి మొరపెట్టుకున్నా పట్టించుకోవట్లేదు. ముంపు కారణంగా శివారు ఆయకట్టు భూములు సార్వా నాట్లకు పనికి రావు. దాళ్వా పంటకు నీరందదు. పేరాయిచెరువు ఆయకట్టు పొలాల రైతులు భూములుండీ లేనివారిగా మిగిలిపోతున్నారు. పొలాలకు తక్షణం పూర్తిస్థాయిలో నీరివ్వకపోతే దాళ్వాపై ఆశ వదులు కోవాల్సిందే.

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా జవహర్



కొవ్వూరు, మార్చి 26: టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శామ్యూల్ జవహర్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు అధిష్ఠానం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో జవహర్ నివాసం వద్ద పార్టీ కార్యకర్తలు, అభిమానులు సంబరాలు జరిపారు. జవహర్ మాట్లాడుతూ పార్టీ బాధ్యతలు అప్పగించినందుకు టీడీపీ అధినేత చంద్రబాబు, నారా లోకేశ్, నందమూరి బాలకృష్ణ, రాష్ట్రాధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయుడిగా ఉన్న జవహర్‌ను గుర్తించి 2014లో టీడీపీ కొవ్వూరు నుంచి నిలబెట్టిన సంగతి తెలిసిందే. అపుడు గెలిచి మంత్రి కూడా అయ్యారు. ఎన్నికల ముందు ఆయన సేవలు ఉపయోగించుకోవాలని అధిష్ఠానం భావించినట్టుంది. ఆయనకు ఏకంగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి పదవిని కట్టబెట్టింది.

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడిగా రెడ్డి సుబ్రహ్మణ్యం




కొత్తపేట, మార్చి 26: టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడిగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేటకు చెందిన ఆ పార్టీ సీనియర్ నాయకుడు రెడ్డి సుబ్రహ్మణ్యం నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. రెడ్డి సుబ్రహ్మణ్యం గతంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్‌గా చేశారు. ప్రస్తుతం రామచంద్రపురం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా వున్నారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యా నికి పలువురు నాయకులు అభినందనలు తెలిపారు.

టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా ముదునూరి



ప్రత్తిపాడు, మార్చి 26: టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా ప్రత్తిపాడు మండలం ధర్మవరంనకు చెందిన ముదునూరి మురళీకృష్ణంరాజు నియమితులయ్యారు. మంగళవారం రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెంనాయుడు ఆదేశాలు జారీ చేశారు. అమలాపురం నియోజకవర్గ పార్టీ పరిశీలకుడిగా ఉన్న మురళీకృష్ణంరాజును తాజాగా రాష్ట్ర పార్టీ కార్యదర్శిగా నియమించడం పట్ల నియోజకవర్గంలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. మురళీరాజుకు పదవి రావడంపై జిల్లాలోని పలువురు టీడీపీ నాయకులు, అభిమానులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపి అభినందనలు తెలిపారు.

టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా వాసిరెడ్డి ఏసుదాసు



సర్పవరం జంక్షన్, మార్చి 26: తెలుగుదేశం రాష్ట్ర కార్యదర్శిగా కాకినాడరూరల్ మాజీ ఎంపీపీ వాసిరెడ్డి ఏసుదాసును నియమిస్తూ ఆపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరపు అచ్చెన్నాయుడు మంగళవారం విడుదలచేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తనకు పదవి అప్పగించిన చంద్రబాబు, అచ్చెన్నాయుడుతో పాటూ ఇతర నాయకులకు ఏసుదాసు కృతజ్ఞతలు తెలిపారు. పంతం నానాజీ విజయంతోపాటూ జిల్లాలో అభ్యర్థుల విజయానికి కృషి చేస్తానన్నారు. టీడీపీ నాయకులు ఏసుదాసును అభినందించారు.

రాజమహేంద్రవరంలో విజిలెన్స్ సోదాలు

రాజమహేంద్రవరం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): నగరంలోని టి.నగర్‌లో ఉన్న లక్ష్మీ గణేశ్ మిల్క్ డెయిరీలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి ఆదేశాలతో సిబ్బంది సోదాలు చేశారు. ఒక వెన్న, రెండు నెయ్యి నమూనాలను సేకరించి ల్యాబ్‌కి పంపించారు. ధ్రువీకరణ లేని తక్కెడ, 5కిలోల పెరుగు బకెట్లపై వినియోగదారుల సంరక్షణ వివరాలు లేకపోవడం, వాణిజ్య అవసరాలకు గృహవినియోగ సిలిండర్లు వాడుతుండడం గుర్తించి కేసులు నమోదు చేశారు. సోదాల్లో డీఎస్పీ ముత్యాలు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కొత్తగా... కొంగొత్తగా

● సార్వత్రిక ఎన్నికలకు నూతన పద్ధతులు

పెద్దాపురం, మార్చి 26 : కొత్తగా..కొంగొత్తగా 2024 సార్వత్రిక ఎన్నికలకు నూతన పద్ధతుల్ని కేంద్ర ఎన్నికల సంఘం ఆచరణలోకి తీసుకురాబోతోంది. పోలింగ్ శాతాన్ని గణనీయంగా పెంచడంతోపాటు యువ ఓటర్లందరూ ఓటుహక్కు వినియోగించుకునేలా ప్రోత్స హించడం, ఎన్నికల సందర్భంగా జరిగే అక్రమాలను నిలువరించేందుకు పటిష్ఠచర్యలు తీసుకుంటోంది. తొలిసారి 85 ఏళ్లపైబడి మంచం కదల్లేని వృద్ధులు, దివ్యాంగులకు ఇంటివద్దే ఓటుహక్కు వినియోగించుకునే అవకాశాన్ని కల్పించనున్నారు.



యూత్ పోలింగ్ కేంద్రం..

యువ ఓటర్లు ఎక్కువమంది ఉన్న ప్రాంతాలను గుర్తించి యు వకుల కోసమే ప్రత్యేకంగా నియోజకవర్గానికి ఒకటిచొప్పున పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటుచేయనున్నారు. ఈకేంద్రంలో పోలింగ్ విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది కూడా యువకులే ఉండేలా చర్యలు తీసుకోనున్నారు. యువఓటర్లను పోలింగ్ కేంద్రాల వైపు నడిపించే లా వారిని ఆకర్షించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. గతంలో మహిళలు, దివ్యాంగుల ఓటింగ్ శాతం పెంచేందుకు వారి కోసమే ప్రత్యేక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. ఈసారి యువ ఓటర్లపై ఈసీ గురిపెట్టింది.

ఇంటివద్దే ఓటుహక్కు...

2019 సార్వత్రిక ఎన్నికల్లో సాధారణ ఓటర్లు అందరూ పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటుహక్కు వినియోగించుకుంటున్నారు. ఈసారి 85 ఏళ్లు పైబడి మంచంపై నుంచి కదల్లేని స్థితిలో ఉన్నవారు, దివ్యాంగు లకు ఇంటివద్దే ఓటుహక్కు వినియోగించుకునే అవకాశాన్ని ఫారం 16డీ ద్వారా కల్పించనున్నారు. హోమ్ ఓటింగ్ కోసం దరఖాస్తు చేసుకుంటే ఎన్నికల అధికారులు పరిశీలించి అవకాశం ఇవ్వను న్నారు.

పోలింగ్ కేంద్రం ఎక్కడో తెలుసుకోవచ్చు..

గత ఎన్నికల్లో జిల్లాలో 80శాతం పోలింగ్ నమోదైంది. ఈసారి 95శాతానికి పైబడి నమోదయ్యేలా ప్రణాళికలు రూపకల్పన చేస్తున్నారు. ఓటర్లకు తమ ఓటు ఎక్కడుందో తెలియకపోవడం, కుటుంబ సభ్యుల ఓట్లు వేర్వేరు చోట్ల ఉండడంతో చాలామంది ఇబ్బంది పడుతున్నారని ఎన్నికల సంఘం గుర్తించింది. ఈనేప థ్యంలో ఓటరు హెల్ప్‌లైన్ యాప్‌ను ప్రవేశపెట్టింది. ఈయాప్‌ను ఫోన్‌లో నిక్షిప్తం చేసుకుని ఓటరు ఎపిక్ కార్డు నంబరు నమోదుచేస్తే ఏ పోలింగ్ కేంద్రంలో ఓటువేసే అవకాశం ఉందనే వివరాల్ని ఇట్టే తెలిసిపోతాయి. ఫోన్ అనుసంధానిత ఐచ్ఛికాన్ని దీనికి ప్రత్యేకంగా ఇచ్చారు.

ప్రతి పైసాకు లెక్క.

ఎన్నికల్లో అభ్యర్థుల వ్యయానికి సంబంధించి ప్రతీ పైసాకు ఈసారి లెక్క ఉండబోతోంది. తొలిసారి నియోజకవర్గానికి ఒక అకౌం టింగ్ బృందాన్ని ఏర్పాటుచేశారు. గతంలో జరిగిన ఎన్నికల్లో అభ్యర్థులు తాము చేసిన వ్యయానికి సంబంధించిన వివరాలన్నీ ఎన్నికల వ్యయ పరిశీలకులకు 15 రోజులకు ఒకసారి సమర్పించాల్సి ఉండేది. ప్రస్తుతం ప్రచారంతోపాటు ఇతరత్రా కార్యక్రమాలకు చేస్తు న్న వ్యయాన్ని పరోక్షంగా అకౌంటింగ్ బృందాలు పరిశీలించనున్నాయి.

పలు రైళ్లు రద్దు, పలు రైళ్లు దారి మళ్లింపు

సామర్లకోట, మార్చి 26: విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో నిర్వహిస్తున్న ట్రాక్ పనుల దృష్ట్యా ఏప్రిల్ 1 నుంచి 28 వరకూ విజయవాడ-విశాఖల మధ్య సామర్లకోట మీదుగా రాకపోకలు సాగించే పలు రైళ్లను తాత్కాలికంగా రద్దు చేసినట్లు, మరికొన్ని రైళ్లను దారి మళ్లించినట్లు రైల్వే పీఆర్వో నస్రత్ మండ్రూప్‌కర్ మంగళవారంరాత్రి సామర్లకోట రైల్వేస్టేషన్ ఉన్నతాధికారికి లేఖ పంపారు. ఈ మేరకు ఆ సమాచారాన్ని ఆంధ్రజ్యోతి సేకరించింది. 22701 నంబరు గల గుంటూరు-విశాఖల మధ్య, 22702నంబరు గల విశాఖ-గుంటూరుల మధ్య, 17219 నంబరు గల మచిలీపట్నం-విశాఖల మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్‌లను ఏప్రిల్ 1 నుంచి ఏప్రిల్ 28 వరకూ రద్దు చేశారు. 17220 నంబరు గల విశాఖ-మచిలీపట్నంల మధ్య నడిచే రైలు ఏప్రిల్ 2 నుంచి ఏప్రిల్ 29 వరకూ రద్దు చేశారు.

మరికొన్ని రైళ్ల దారి మళ్లింపు

13351 నంబరు గల ధన్‌బాద్-అలపూజ మధ్య రాకపోకలు సాగించే బొకారో ఎక్స్‌ప్రెస్ రైలు ఏప్రిల్ 1 నుంచి 28వరకూ నిడదవోలు, భీమవరం, గుడివాడల మీదుగా విజయవాడ చేరుతుంది. 12835 నంబరు గల హతియా-బెంగుళూరుల మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్ రైలు ఏప్రిల్ 2, 7, 9, 14, 16, 21, 23, 28 తేదీలలో నిడదవోలు, భీమవరం, గుడివాడల మీదుగా విజయవాడ చేరుతుంది. 18637 నంబరు గల హతియా-బెంగుళూరుల మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్ రైలు ఏప్రిల్ 6, 13, 20, 27 తేదీలలో నిడదవోలు, భీమవరం, గుడివాడల మీదుగా విజయవాడకు చేరుతుంది. 22837 నంబరు గల హటియా-ఎర్నాకుళంల మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్ రైలు ఏప్రిల్ 1, 8, 15, 22 తేదీలలో నిడదవోలు, భీమవరం, గుడివాడల మీదుగా విజయవాడకు చేరుతుంది. 18111 నంబరు గల టాటా-యశ్వంత్‌పూర్‌ల మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్ రైలు ఏప్రిల్ 4, 11, 18, 25 తేదీలలో నిడదవోలు, భీమవరం, గుడివాడల మీదుగా విజయవాడకు చేరుతుంది. 12376 నంబరు గల జాసిడ్-తాంబరమ్‌ల మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్ రైలు ఏప్రిల్ 3, 10, 17, 24 తేదీలలో నిడదవోలు, భీమవరం, గుడివాడల మీదుగా విజయవాడకు చేరుతుంది. 12509 నంబరు గల బెంగుళూరు-గౌహతిల మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్ రైలు ఏప్రిల్ 3, 5, 10, 12, 17, 19, 24, 26 తేదీలలో విజయవాడ, గుడివాడ, భీమవరం టౌన్‌ల మీదుగా నిడదవోలు చేరుతుంది. 11019 నంబరు ముంబాయి-భువనేశ్వర్‌ల మధ్య రాకపోకలు సాగించే కోణార్క్ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 1, 3, 5, 6, 8, 10, 12, 13, 15, 17, 19, 20, 22, 24, 26, 27 తేదీలలో విజయవాడ,గుడివాడ, భీమవరం టౌన్‌ల మీదుగా నిడదవోలు చేరుతుంది. 12889 నంబరు గల టాటా-ఎస్ఎంవీ బెంగుళూరుల మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్ రైలు ఏప్రిల్ 5, 12, 19, 26 తేదీలలో నిడదవోలు, భీమవరం, గుడివాడల మీదుగా విజయవాడకు చేరుతుంది. 22643 నంబరు గల ఎర్నాకుళం-పాట్నాల మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్ రైలు ఏప్రిల్ 12, 8, 15, 22 తేదీలలో విజయవాడ, గుడివాడ, భీమవరంల మీదుగా నిడదవోలు చేరుతుంది. 12756 నంబరు గల భావనగర్-కాకినాడ పోర్టుల మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్ రైలు ఏప్రిల్ 6, 13, 20, 27 తేదీలలో విజయవాడ, గుడివాడ, భీమవరంల మీదుగా నిడదవోలు చేరుతుంది. మరిన్ని వివరాలకు సమీపంలో గల రైల్వే స్టేషన్ బుకింగ్ కార్యాలయ సిబ్బంది ద్వారా సమాచారాన్ని తెలుసుకోవచ్చని రైల్వే పీఆర్వో నస్రత్ మండ్రూప్‌కర్ తెలిపారు.

జనసేన నాయకుడికి ఎస్ఐకి మధ్య వివాదం

● పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత

ముమ్మిడివరం, మార్చి 26: భూ తగాదా విషయంలో పోలీసుస్టేషన్‌కు వెళ్లిన జనసేన నాయకుడి పట్ల ఎస్ఐ దౌర్జన్యంగా ప్రవర్తించిన తీరుపై ముమ్మిడివరంలో మంగళవారం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. భూ తగాదా విషయంలో లంకాఫ్ ఠాణేలంక గ్రామానికి చెందిన ఇరువర్గాల వారిని ఎస్ఐ బి.సురేష్‌బాబు మంగళవారం పోలీసుస్టేషన్‌కు పిలిపించి ఇరువర్గాలకు చెందినవారిని కూర్చోబెట్టారు. జనసేన పార్టీ నాయకుడు గోదశి పుండరీష్ పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఆ భూ వివాదం గురించి మాట్లాడుతుండగా ఎస్ఐ ఏకవచనంతో మాట్లాడి దురుసుగా ప్రవర్తించడంతో పుండరీష్‌కు, ఎస్ఐకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. విషయం బయటికి రావడంతో జనసేన, టీడీపీ నాయకులు, ఓ సామాజికవర్గానికి చెందిన యువత పోలీసుస్టేషన్‌కు తరలివచ్చి ఆందోళనకు దిగారు. ఎస్ఐకు వ్యతిరేకంగా నినాదాలుచేసి ఎస్ఐ దౌర్జన్యం నశించాలని రోడ్డుపై బైఠాయించారు. దీంతో సీఐ ఎన్.కొండయ్య అక్కడకు చేరుకుని బాధితుడు పుండరీష్‌ను ఎస్ఐ సురేష్‌బాబును, నాయకులతో మాట్లాడి జరిగిన విషయంపై సుదీర్ఘ చర్చలు జరిపారు. స్టేషన్ ఎదుట పెద్దఎత్తున ఆందోళనకారులు గుమిగూడి పరిస్థితి ఉద్రిక్తతకు దారితీయడంతో వారందరికీ సీఐ నచ్చజెప్పి బుధవారం మరోసారి చర్చించి వాస్తవాలు తెలుసుకుని చర్యలు తీసుకుంటామని సీఐ వారికి హామీఇచ్చి పంపించి వేశారు. నాయకులు తాడి నరసింహారావు, చెల్లి అశోక్, దాట్ల పృథ్వీరాజ్, గుద్దటి జమి, దేశంశెట్టి గోపి, తోలేటి రాంబాబు, పోలిశెట్టి బాబి, నూకల దుర్గలతోపాటు పలువురు చర్చలు జరిపిన వారిలో ఉన్నారు. పుండరీష్ ఎవరో తెలి యక అలా మాట్లాడానని ఎస్ఐ సురేష్‌బాబు సంజాయిషీ ఇచ్చినప్పటికీ పుండరీష్ సంతృప్తి చెందలేదు.



ముమ్మిడివరంలో రాస్తారోకో చేస్తున్న యువకులు

ఇద్దరు ఇంటి దొంగల సస్పెన్షన్

● టేకు చెట్ల గల్లంతు బాగోతంలో ప్రాథమిక చర్యలు
● మరికొందరిపై చర్యలకు రంగం సిద్ధం
● డివిజన్‌స్థాయి నుంచి బీట్ స్థాయి వరకు జల్లెడపట్టే పనిలో దర్యాప్తు బృందాలు

రంపచోడవరం, మార్చి 26: రంపచోడవరం అటవీశాఖ డివిజన్ పరిధిలో రంపచోడవరం, మారేడుమిల్లి రేంజ్‌ల పరిధిలో టేక్ ప్లాంటేషన్లలో 400కు పైగా టేకు చెట్లను నరికేసిన అక్రమ బాగోతంలో ఒక డిప్యూటీ రేంజ్ అధికారిని, మరొక ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌ను సస్పెండ్ చేస్తూ అటవీశాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ వ్యవహారంలో ఈ పై ఇద్దరి పాత్ర ఆధారాలతో రుజువు కావడంతో వారిపై తక్షణ చర్యలు తీసుకున్నారు. ఇదే భాగోతంలో మరి కొందరిపై చర్యలు తీసుకునేందుకు వీలుగా సమగ్ర దర్యాప్తును రాజమహేంద్రవరంలోని అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ పర్యవేక్షణలో ఆరు బృందాలను నియమించించిన సంగతి తెలిసిందే. అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి డివిజన్‌స్థాయి నుంచి బీట్ స్థాయి వరకు అందరి అధికారులు తమ సిబ్బంది సెల్‌ఫోన్లను కూడా జల్లెడపట్టే పనిలో దర్యాప్తు బృందాలు నిమగ్నమయ్యాయి.



హుండీలలో కానుకలను లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

అన్నవరం సత్యదేవుడి హుండీల ఆదాయం రూ. 1.01 కోట్లు

అన్నవరం, మార్చి 26: రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధికి విచ్చేసిన భక్తులు హుండీలలో సమర్పించిన కానుకలను మంగళవారం లెక్కించగా రూ.1,01,55,528 నగదు, 12 గ్రాముల బంగారం, 522 గ్రాముల వెండి లభించింది. వీటితోపాటుగా యూఎస్ఏకు చెందిన 41 డాలర్లు, సింగపూర్ 12, మలేషియా 11 డాలర్లు సమకూరాయి. లెక్కింపును ఈవో రామచంద్ర మోహన్, ఛైర్మన్ రోహిత్, డిప్యూటీ కమిషనర్ రమేష్‌బాబు తదితరులు పర్యవేక్షించగా సిబ్బంది, వ్రతపురోహితులు, నాయీబ్రాహ్మణులు లెక్కింపులో పాల్గొన్నారు. 20 రోజులకు ఈ ఆదాయం లభించగా రోజుకు స్వామి వారి హుండీలలో రూ. 5.07 లక్షలను భక్తులు సమర్పించుకున్నారు.

అంతర్వేది స్వామివారి ఆదాయం రూ.16,49,294



అంతర్వేదిలో స్వామివారి హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

అంతర్వేది, మార్చి 26: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో 29 రోజులకుగాను స్వామివారి హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. ప్రధాన ఆలయం, గుర్రాలక్కమ్మ అమ్మవారి హుండీ ద్వారా రూ.16,12,175, అన్నదాన హుండీ ద్వారా రూ.37,119, మొత్తం హుండీల ఆదాయం రూ.16,49,294 వచ్చింది. అలాగే స్వామివారి అనుబంధ ఆలయమైన నీలకంఠేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.15,491 వచ్చిందని ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఏసీ నాగమల్లేశ్వరరావు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

భావనారాయణస్వామి హుండీ ఆదాయం రూ.5.63లక్షలు

సర్పవరం జంక్షన్, మార్చి 26: మాఘమాసంలో సర్పవరంలో శ్రీరాజ్యలక్ష్మి సమేత శ్రీభావనారాయణస్వామికి భక్తులు వివిధ కానుకల రూపంలో శ్రీవారి హుండీలో వేసిన నగదును లెక్కించగా రూ.5,63,490లు ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో జొన్నాడ భీమశంకరరావు తెలిపారు. మంగళవారం సర్పవరంలో శ్రీభావనారాయణస్వామి ఆలయ ప్రాంగణంలో దేవాదాయ,ధర్మాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఫణీంద్ర ఆధ్వర్యంలో స్వామివారి హుండీలో వేసిన నగదును భక్తుల సమక్షంలో లెక్కించారు. మాఘమాసం నెల రోజులపాటు నిర్వహించిన మాఘమాస తిరునాళ్లకు శ్రీభావనారాయణ స్వామిని దర్శించుకున్న భక్తులద్వారా ఈ ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

మనస్తాపంతో బాలిక ఆత్మహత్య

కాకినాడ రూరల్, మార్చి 26: కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం తూరంగి మహాలక్ష్మినగర్‌కు చెందిన ఓ బాలిక ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం జరిగి ంది. ఇంద్రపాలెం ఎస్ఐ మణికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మహత్య చేసుకున్న బాలిక తరచూ వేరే యువకుడితో ఫోన్‌లో మాట్లాడేదని అది తెలుసుకున్న తల్లిదండ్రులు ఆమెను మందలించగా మనస్తాపానికి గురైన బాలిక వారి ఇంటి పైఅంతస్తులోని గదిలోగల సీలింగ్ ఫ్యాన్‌కు సోమవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడగా వెంటనే వైద్యం నిమిత్తం తల్లిదండ్రులు కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మంగళవానం ఉదయం చనిపోయిందన్నారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గడ్డి మందు తాగి బాలిక మృతి

కొత్తపల్లి, మార్చి26: మాట వినడంలేదని తల్లి మందలించిన సంఘటనలో బాలిక గడ్డి మందు తాగి మృతి చెందిందని మంగళవారం కొత్తపల్లి పోలీసులు తెలిపారు. కాకినాడజిల్లా కొత్తపల్లి మండలం కొండెవరం గ్రామానికి చెందిన బండి మణి చంద్రికను ఆమె తల్లి ఇంటివద్ద మాట వినకుండా ఏపనిచేయడంలేదని ఈనెల 19న మందలించింది. దీంతో మనస్తాపం చెందిన బాలిక గడ్డి మందు తాగి అపస్మారకస్థితికి చేరింది. ఈ విషయాన్ని గుర్తించిన తల్లిదండ్రులు తొలుత పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అత్యవసర వైద్యం అవసరం కావడంతో వెంటనే కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం బాలిక మృతి చెందిందని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి



మృతిచెందిన ఉపాధ్యాయుడు సాంబయ్య

కూనవరం,మార్చి26: రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతిచెందిన సంఘటన సోమవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం అల్లూరి జిల్లా కూనవరం మండలం నరసింగపేటగ్రామానికి చెందిన సోయం సాంబయ్య టేకుబాక గ్రామంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. భీమవరం గ్రామంలో పనులు ముగించుకుని తిరుగు ప్రయాణంలో నరసింగపేట-పొట్టాయిగూడెం మధ్యలోసాంబయ్య, అతని స్నేహితుడు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి టాటా వ్యాన్ ఢీకొంది. దీంతో తీవ్రగాయాలైన సాంబయ్య, స్నేహితుడు రాజును ప్రభుత్వాస్పత్రికి తరలించగా సాంబయ్య మృతి చెందాడు. రాజును మెరుగైన వైద్యం కోసం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాకినాడ శిశువిహార్‌కు మగశిశువు



సర్పవరంజంక్షన్, మార్చి 26: కాకినాడ జీజీహెచ్‌లో 10 రోజుల చికిత్స అనంతరం ఆరోగ్యంగా కోలుకున్న మగ శిశువును అశోక్‌నగర్‌లో గల శిశువిహార్ సెంటర్‌లో ఉంచినట్లు ఐసీడీఎస్ పీడీ కె. ప్రవీణ ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 13వ తేదీ రాత్రి 8 గంటల సమయంలో తెల్లటి గుడ్డలో చుట్టిన మగశిశువును బోట్‌క్లబ్ ప్రవేశద్వారం వద్ద వదిలేసి ఉండటం, శిశువు ఏడుపు విన్న స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చి 108 సాయంతో జీజీహెచ్‌లో ఎస్ఐసీయూలో ఉంచిన వైద్యులు శిశువుకు వైద్య చికిత్సలు అందించారు. సర్పవరం పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేశామన్నారు. చిన్నారి ఆరోగ్యసంరక్ష కోసం శిశువిహార్‌లో ఉంచామని, ఈ బాబు కోసం సంబంధిత తల్లిదండ్రులు, రక్త సంబంధీకులు 30 రోజుల్లో తగిన ఆధారాలతో తమను సంప్రదించాలని కోరారు. ఎవరూ రాని పక్షంలో చట్టబద్ధంగా బాబును దత్తత ఇస్తామన్నారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారికి జైలు

రాజమహేంద్రవరం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): అధిక సొమ్ము రాబడి ఉంటుందని ఆశజూపి మోసం చేసిన కేసులో ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారస్తుడికి కోర్టు జైలు శిక్ష విధించింది. టూటౌన్ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లజర్ల మండలం ప్రకాశరావుపాలెంనకు చెందిన కాకర్ల శ్రీనివాసచౌదరి... కోమలి రియల్ ఎస్టేట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పేరుతో రియల్ ఎస్టేటు వ్యాపారం చేస్తుంటాడు. రాజమహేంద్రవరం టి.నగర్‌లో ఓ కార్యాలయం తెరిచాడు. తణుకులో వెంచర్లు వేశామని పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని పలువురిని నమ్మించాడు. రూ.10 వేలు కడితే రోజుకు రూ.300 చొప్పున 300రోజుల్లో మూడు రెట్లు అధికంగా పొందవచ్చని ఆశజూపాడు. వలలో పడిన కొందరికి రశీదులు కూడా ఇచ్చాడు. అయితే తర్వాత ముఖం చాటేశాడు. దీంతో 35 మంది బాధితులు పోలీసులను ఆశ్రయించారు. నేరం రుజువు కావడంతో శ్రీనివాసరావుకు మూడేళ్ల జైలు, రూ.5వేల జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్సు జడ్జి ఎస్.ప్రవీణ్‌కుమార్ తీర్పు చెప్పారు. నేరస్తుడికి త్వరితగతిన శిక్ష పడడంలో చొరవచూపిన డీఎస్పీ అంబికాప్రసాద్, సీఐ శ్రీనివాస రావు, పీపీ ఎంఎ బాషా, హెచ్‌సీ సీహెచ్ శ్రీనివాసరావును ఎస్పీ జగదీశ్ అభినందించారు.

దేవరపల్లి పాఠశాలలో స్వల్ప అగ్నిప్రమాదం

● వంట చేస్తుండగా గ్యాస్ లీకై మంటలు.. అదుపు చేసిన సిబ్బంది

దేవరపల్లి, మార్చి 26: దేవరపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్నభోజనం చేసే సందర్భంలో స్వల్ప అగ్నిప్రమాదం సంభవించిందని ఎంఈవో తిరుమలదాసు తెలిపారు. పాఠశాలలో మంగళవారం ఉదయం వంట చేస్తుండగా గ్యాస్ లీకై మంటలు వ్యాపించాయన్నారు. వెంటనే హెల్పర్స్ గమనించి ఉపాధ్యాయుల సాయంతో ఫైర్ ఎక్సింగ్ మిషన్ ద్వారా మంటలను అదుపు చేశారన్నారు. అయితే సదరు మిషన్ ద్వారా వచ్చిన వాయువు వల్ల ఆహార పదార్థాలు తినడానికి పనికి రాకుండా పోయాయని, నిల్వ ఉంచిన నిత్యావసర సరుకులు కూడా పాడయ్యాయన్నారు. ఈ విషయాన్ని పైఅధికారులకు తెలియజేస్తామన్నారు. కాగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని ప్రత్యామ్నయ పద్ధతిలో అందించామన్నారు. ఈ సంఘటన వల్ల రూ.10 వేల వరకు నష్టం జరిగినట్టు తెలిపారు.

గోదావరిలో మునిగి యువకుడి మృతి



గోదావరిలో మునిగి మృతిచెందిన శివశంకర్ మృతదేహంవద్ద రోధిస్తున్న బంధువులు

సీతానగరం, మార్చి 26: గోదావరిలో మునిగి యువకుడు మృతి చెందిన విషాద సంఘటన ముగ్గుళ్ల గ్రామంలో జరిగింది. పశ్చిమగోదావరిజిల్లా పోలవరం గ్రామానికి చెందిన గోపల శివశంకర్ కుటుంబం రఘుదేవపురంలోని అమ్మమ్మ ఇంటికి వచ్చి ఉంటోంది. మంగళవారం ఉదయం శివశంకర్ (21) తన స్నేహితులతో కలసి ముగ్గుళ్లలోని గోదావరిలో స్నానానికి వెళ్లాడు. స్నేహితులు ముగ్గురు ఒడ్డున స్నానం చేస్తుండగా శివ శంకర్ కొంతమేర లోపలికి వెళ్లగా మునిగిపోయాడు. స్నేహితులు రక్షించే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. సమాచారం అందుకున్న ఏఎస్ఐ సమర్పణరావు, సిబ్బంది సంఘనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టగా సాయంత్రం సుమారు 5గం.లకు మృతదేహం లభ్యమైంది. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసు పత్రికి తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు సమర్పణరావు తెలిపారు. ఈఘటనతో రఘుదేవపురంలో విషాదఛాయలు అలుముకున్నాయి. చేతికి అందివచ్చిన కుమా రుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు బోరున విల పిస్తున్నా రు. గోదావరిలో నిబంధనలు అతిక్రమించి లోతుగా ఇసుక తవ్వకాలు జరిగాయని, ఆ గోతులవల్ల మునిగిపోయినట్టు తెలుస్తోంది.

శ్రీరామజన్మభూమి మినియేచర్ పత్రం విడుదల

అమలాపురం టౌన్, మార్చి 26: అయోధ్యలో ప్రారంభించిన శ్రీరామ జన్మభూమి ఆలయంపై భారత తపాలా శాఖ ఆరు తపాలా బిళ్లలతో కూడిన మినియేచర్ పత్రాన్ని విడుదల చేసింది. తపాలా బిళ్లల ముఖ విలువ ఒక్కొక్కటీ రూ.5 కాగా మినియేచర్ పత్రానికి రూ.100గా నిర్ధారించారు. ఈమినియేచర్ పత్రాన్ని అమలాపురం భూపయ్య అగ్రహారానికి చెందిన తపాలా బిళ్లల సేకరణ కర్త పుత్సా కృష్ణకామేశ్వర్ సేకరించారు.



పది పరీక్షకు వెళుతుండగా తండ్రి మరణవార్త

● పుట్టెడు దుఃఖంలో పరీక్ష రాసిన టెన్త్ విద్యార్థి





తండ్రి మృతదేహం వద్ద విలపిస్తున్న చరణ్

రాజవొమ్మంగి మార్చి 26: అల్లూరి జిల్లా రాజవొమ్మంగి మండలంలోని తంటికొండ గ్రామానికి చెందిన పరిశిక చరణ్ ప్రస్తుతం పదవ తరగతి పరీక్షలు రాస్తున్నాడు. ఇంటి నుంచి రాజవొమ్మంగిలోని పరీక్షా కేంద్రానికి వచ్చిన చరణ్‌కు తన తండ్రి చనిపోయాడనే విషయం తెలిసింది. అందరూ ఇంటికి వెళ్లిపొమ్మన్నారు. తండ్రి మరణంతో దుఃఖంలో ఉన్న చరణ్ పరీక్ష రాసే వెళ్తానని చెప్పి, పరీక్ష త్వరగా రాసి ఇంటికి వెళ్లి తన తండ్రి భౌతికకాయానికి అంత్యక్రియలు నిర్వహించాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం చరణ్ తండ్రి బాలరాజు జీడిమామిడి తోటకు వెళ్లి తీవ్ర అస్వస్థతకు గురై పడిపోవడంతో గ్రామస్థులు ఇంటికి తీసుకుని వచ్చారు. మంగళవారం ఉదయం పదో తరగతి పరీక్ష రాసేందుకు చరణ్ రాజవొమ్మంగి వచ్చే సరికి పలువురి ద్వారా తన తండ్రి మరణవార్త తెలుసుకున్నాడు. దుఃఖాన్ని దిగమింగుకొని పరీక్ష రాశాడు. పరీక్ష అనంతరం తన సోదరుడు హర్షవర్ధన్‌తో కలిసి అంత్యక్రియలు నిర్వహించాడు.

- మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు
- కోరుమిల్లిలో భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం
- టీడీపీ సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం

ఓటర్లు చైతన్యవంతం కావాలంటూ మానవహారం

ఆత్రేయపురం, మార్చి 26: ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు వెంకట్రామయ్య కోరారు. మంగళవారం వీఆర్వోలు, బీఎల్వోలు, రెవెన్యూ సిబ్బంది మోటారు సైకిళ్లపై ర్యాలీ నిర్వహించారు. ఆత్రేయపురం బస్టాండు సెంటర్లో మానవహారం నిర్మించి ఓటర్లను చైతన్యవంతం చేశారు. మహాత్మాగాంధీ విద్యాసంస్థలకు వెళ్లి విద్యార్థులకు ఓటు హక్కు ప్రాముఖ్యాన్ని వివరించారు. డిప్యూటీ తహసీల్దారు ఇస్మాయిల్, ఆర్ఐ భవానీ తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లేవు


మాట్లాడుతున్న ఉమ్మడి అభ్యర్థి దేవ వరప్రసాద్

రాజోలు, మార్చి 26: జగన్ పాలనలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక యువత అల్లాడిపోతున్నారని జనసేన, టీడీపీ, బీజేపీ పార్టీల రాజోలు నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి దేవ వరప్రసాద్ విమర్శించారు. రాజోలులో శ్రీవిజయదుర్గా లాడ్జి ఆవరణలో రాజోలు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ అడబాల రాంబాబు అధ్యక్షతన మంగళవారం జరిగిన బీజేపీ కార్యకర్తల సమావేశానికి ఆయన మాట్లాడారు. రాష్ట్రం ఐదేళ్లగా అసమర్థ, అవినీతి, దోపిడీ, దౌర్జన్యం జరుగుతున్నాయన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ సంకీర్ణ ప్రభుత్వాన్ని గెలిపించి వైసీపీని బంగాళాఖాతంలో కలపాలని పిలుపునిచ్చారు. తొలుత వరప్రసాద్‌కు సీనియర్ బీజేపీ నాయకులు వాడ్రేవు పాపయ్యపంతులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపి దుశ్శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో మాలే శ్రీనివాసనగేష్, విశ్రాంత ఎంఈవో జొన్నలగడ్డ గోపాలకృష్ణ, వడ్లమూడి ప్రకాష్, యింటిపల్లి రామకృష్ణ, దేవళ్ల మాణిక్యాలరావు, గొల్లమందల నిరంజనరావు, గుండుబోగుల పెద్దకాపు, కాట్న రాజు, గెడ్డం మహాలక్ష్మిప్రసాద్, గుండాబత్తుల తాతాజీ, పినిశెట్టి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

కాపులను మభ్యపెట్టిన జగ్గిరెడ్డి: సంఘ నాయకులు


మాట్లాడుతున్న కాపు సంఘ నాయకులు

ఆలమూరు, మార్చి 26: ఆలమూరు కాపు కల్యాణ మండపానికి నిధులు మంజూరు చేశామంటూ హడవిడి చేసిన ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డిని, ఆ నిధులు ఏమయ్యాయని కాపు నాయకులు ప్రశ్నించారు. ఆలమూరులో కాపు నాయకులు మంగళవారం విలేకరులతో మాట్లాడారు. కాపు కల్యాణ మండపానికి టీడీపీ ప్రభుత్వ కాలంలో కాపు కార్పొరేషన్ ద్వారా రూ.50లక్షల నిధులు, 40సెంట్ల స్థలాన్ని మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మంజూరు చేయించారన్నారు. అయితే ఈనిధులతో పనులు పూర్తి కాకపోవడంతో కాపుల వద్ద నుంచి చందాలు సేకరించి కొంతమేర పనులు చేయించామన్నారు. రూ.రెండు లక్షలతో ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి భారీ సత్కారాలు చేశామని, ఆ సమయంలో రూ.15లక్షల నిధులు ఇస్తున్నట్లు మంజూరు కాపీని గత ఏడాది ఆగస్టులో అందించారని చెప్పారు. ఆ నిధులు ఏమయ్యాయో తెలియజేయాలని వారు కోరారు. సమావేశంలో నాయకులు రామానుజుల శేషగిరిరావు, మానేపల్లి శ్రీనివాస్, వెంపల సత్యనారాయణ, తమ్మిరెడ్డి సాయిబాబు, చల్లా వెంకటేశ్వరరావు, సిరిగినేడి పట్టాభి, వెంపల శ్రీనివాస్ పాల్గొన్నారు.

కూటమి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

మండపేట, మార్చి 26. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వంలో పాలన గాడి తప్పిందని, త్వరలో జరిగే ఎన్నికల్లో టీడీపీ జనసేన, బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా టీడీపీ కార్యకర్తలు బూత్‌ఇన్‌చార్జీలు, కుటుంబసారధులు పనిచేయాలని టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి, మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ పిలుపు నిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన 6,9 వార్డులకు చెందిన బూత్ ఇన్‌చార్జీలు, కుటుంబసారధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రం సంక్షేమం, అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు పాలన అవసరమన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లా కమిటీ సభ్యునిగా సురేష్



అమలాపురం టౌన్, మార్చి 26: దివ్యాంగులు పూర్తిస్థాయిలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఏర్పాటుచేసిన జిల్లా మోనటరింగ్ కమిటీలో కామనగరువుకు చెందిన నిమ్మకాయల సురేష్‌ను సభ్యునిగా నియమించారు. ఈమేరకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హిమాన్షు శుక్లా ఉత్తర్వులిచ్చారు. కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరించే ఈకమిటీలో ఐదుగురు సభ్యులను నియమించారు. వీరిలో లూయా అంధుల కళాశాల ప్రిన్సిపాల్ రామాయణం శ్రీనివాస్ కూడా ఉన్నారు.

ముగ్గురు విద్యార్థుల గైర్హాజరు

అంబాజీపేట, మార్చి 26: అంబాజీపేట, తొండవరం, పుల్లేటికుర్రు కేంద్రాల్లో మంగళవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. జీవశాస్త్రం పరీక్షకు ముగ్గురు విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఈవోలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష తెలిపారు.

సోషల్ మీడియాలో పోస్టులు జాగ్రత్తగా పెట్టాలి

మామిడికుదురు, మార్చి 26: సోషల్ మీడియాలో పోస్టులు ఆచితూచి జాగ్రత్తగా పెట్టాలని నగరం ఎస్ఐ పి.సురేష్ సూచించారు. అడ్మిన్ వివాస్పద పోస్టులపై చర్యలు తీసుకోకుంటే అడ్మిన్ కూడా నేరస్తుడేనని, వివాదాస్పద పోస్టులు పెడితే చట్టరీత్యా శిక్షార్హులని తెలిపారు. విద్వేషాలు, రెచ్చగొట్టేవి, వర్గపోరుకు దారితీసేవి, దేశ భద్రతకు ముప్పు కలిగించేవి, ఫేక్ సమాచారం, మార్ఫింగ్ చేసిన ఫొటోలు, వీడియోలు, వ్యక్తిగత ఫొటోలు, వీడియోలను గ్రూపుల్లో షేర్ చేసే వారిపై ఐపీసీ సెక్షన్ 153ఏ కింద కేసు నమోదు చేస్తామని, నేరం రుజువైతే ఐదేళ్లు జైలుశిక్ష పడుతుందని తెలిపారు.

కాంగ్రెస్ బూత్ ఏజెంట్ల సమావేశం

ద్రాక్షారామ, మార్చి 26: స్థానిక గున్నయ్య తూము వద్ద ఫంక్షన్ హాలులో రామచంద్రపురం పట్టణం, మండలం, కె.గంగవరం మండలాల కాంగ్రెస్ పార్టీ బూత్‌ఏజెంట్ల సమావేశం మంగళవారం జరిగింది. పార్టీ జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకరరావు మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వస్తేనే ఏపీకి ప్రత్యేక హోదా, ఇతర ప్యాకేజీలు అమలు అవుతాయన్నారు. సమావేశంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి కోట శ్రీనివాసరావు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఆర్.డి.ఖాన్ పార్టీ కె.గంగవరం మండల అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, కాంగెస్ నాయకులు ఖురేషి, రామకృష్ణ, చంద్రమల్ల దొరబాబు, బి.వి.వి.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), మార్చి26: రామచంద్రపురంలో మంగళవారంరాత్రి ముస్లింలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ పాల్గొన్నారు. స్థానిక ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వంతో ప్రజలు ఇబ్బందులు



కపిలేశ్వరపురం: ఎమ్మెల్యే వేగుళ్లను సన్మానిస్తున్న గ్రామస్తులు, కొత్తపేట: సమావేశంలో మాట్లాడుతున్న బండారు సత్యానందరావు

కపిలేశ్వరపురం, మార్చి 26: వైసీపీ ప్రభుత్వంలో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారని ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. కోరుమిల్లిలో మంగళవారం నిర్వహించిన బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తొలుత ఎమ్మెల్యే వేగుళ్ల గ్రామంలోని సీతారాముల ఆలయంలో స్వామివారికి 108 కొబ్బరికాయలు కొట్టి మొక్కుతీర్చుకున్నారు. అనంతరం టీడీపీ శ్రేణులతో కలిసి ఆయన ఇంటింటా తిరిగి చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఆయనకు ప్రజలు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. మహిళలు హారతులిచ్చి స్వాగతం పలికారు.సర్పంచ్ ఆచంట సత్యనారాయణ, జనసేన మండల అధ్యక్షుడు తుట్టపు నాగరాజు, కోరుమిల్లి గ్రామపరిశీలకుడు వాద ప్రసాదరావు, టీడీపీ శ్రేణులు మోటుపల్లి బాపిరాజు, ఎలుగుబంటి వీరభద్రం, గంగుమళ్ల వీరబాబు, దొడ్డా ఏసు, పోలపల్లి సుబ్రహ్మణ్యం, సుంకర శ్రీనివాస్, కొండిశెట్టి నాగేశ్వరరావు, కాకులపాటి సుబ్రహ్మణ్యం, కార్యకర్తలు పాల్గొన్నారు.

దోపిడీదారులను సాగనంపేందుకు ప్రజలు సిద్ధం

కొత్తపేట, మార్చి 26: రాష్ట్రంలో వైసీపీ దోపిడీదారులను ఇంటికి సాగనంపేందుకు ప్రజలు సంసిద్ధం కావాలని కొత్తపేట అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి బండారు సత్యానందరావు పిలుపునిచ్చారు. మంగళవారం కొత్తపేటలో జరిగిన టీడీపీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మద్య నిషేదం అమలు చేసి ఓట్లు అడుగుతానన్న జగన్ ఆ హామీని ఎందుకు నెరవేర్చలేదో ప్రజలకు చెప్పాలన్నారు. 85శాతం హామీలను తుంగలోకి తొక్కిన జగన్ సర్కారు రూ.8లక్షల కోట్ల రాష్ట్ర సంపదను దోచుకుందన్నారు. తెలుగురైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీల అభ్యున్నతికి టీడీపీ కృషి

కొత్తపేట, మార్చి 26: బీసీల అభ్యున్నతికి టీడీపీ ఎంతగానో కృషి చేస్తుందని కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి బండారు సత్యానందరావు అన్నారు. మంగళవారం స్థానిక కాపు కల్యాణ మండపంలో ఆలమూరు మండల క్లస్టర్ల 'జయహో బీసీ' సదస్సు నిర్వహించారు. సత్యానందరావు మాట్లాడుతూ బీసీలకు 50 ఏళ్లకే రూ.4వేలు పింఛను ఇస్తామని, ప్రత్యేక రక్షణ చట్టం తేవడంతో పాటు వైసీపీ ప్రభుత్వం రద్దుచేసిన పారిశ్రామిక ప్రోత్సాహకాలను పునరుద్ధరిస్తామన్నారు. సమావేశంలో టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు మెర్ల గోపాలస్వామి, చెల్లబోయిన సింహచలం, కాసా సాగర్, కేతా శ్రీను, కాలా సాయిబాబు, రామారావు, బీసీ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లైన్‌పేటలో ఎన్నికల శంఖారావం

కాట్రేనికోన, మార్చి 26: పల్లంకుర్రు పంచాయతీ లైన్‌పేట బూత్ నెం.121లో మంగళవారం టీడీపీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ, భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం జరిగింది. ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. మాజీ జడ్పీటీసీ ఇసుకపట్ల వెంకటేశ్వరరావు, ఇసుకపట్ల రాంబాబు, ఇసుకపట్ల రమణ, బడుగు పుల్లారావు, ఇసుకపట్ల చక్రం, ఇసుకపట్ల గోవిందు, ఇసుకపట్ల సురేష్, వరసాల రాంప్రకాష్, పులుగు సురేంద్రబాబు, ఇసుకపట్ల శివ పాల్గొన్నారు.

కార్యకర్తలు తలెత్తుకుని తిరిగేలా పనిచేస్తా: సుభాష్



ద్రాక్షారామ: జనసేన, టీడీపీ నాయకులు, సుభాష్ తదితరుల సంఘీభావం, ఐ.పోలవరం: బుచ్చిబాబు, హరీష్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన వైసీపీ సర్పంచ్ ముదునూరి

రామచంద్రపురం(ద్రాక్షారామ), మార్చి 26: రామచంద్రపురం నియోజకవర్గంలో జనసేన, టీడీపీ కార్యకర్తలు తలెత్తుకుని తిరిగేలా పనిచేస్తానని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ అన్నారు. మంగళవారం రామచంద్రపురంలో లయన్స్ కల్యాణ మండపంలో సుభాష్‌కు మద్దతు తెలుపుతూ నిర్వహించిన జనసేన కార్యకర్తల సమావేశంలో సుభాష్ మాట్లాడారు. ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటు అనంతరం ప్రతీ గ్రామంలో జనసేన పార్టీకి చెందిన నలుగురు పెద్దలు, నలుగురు యువకులతో సమన్వయ కమిటీలు ఏర్పాటుచేసి వారి చెప్పిన విధంగానే పనులు చేస్తామన్నారు. టీడీపీకి కూడా కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్‌కు సీటు రాకపోయినా తన క్యాడర్ గురించి మాత్రమే భరోసా అడిగారన్నారు. పోలిశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆదేశాలు శిరోధార్యంగా జనసైనికులు సుభాష్ విజయానికి కృషి చేయాలని పిలుపు నిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 40శాతం పదవులు జనసేనకు కేటాయిస్తానని సుభాష్ వద్ద హామీ తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్లు గరిగిపాటి సూర్యనారాయణమూర్తి, కొమరిన వీర్రాజు, టీడీపీ నాయకులు రాయపురెడ్డి సూరిబాబు, జనసేన పట్టణ అధ్యక్షుడు గొల్లపల్లి కృష్ణ, పార్టీ మండలాల అధ్యక్షులు బొండా వెంకన్న, చిర్రా రాజకుమార్, పోతాబత్తుల విజయకుమార్ జిల్లా కార్యదర్శి సంపత్ జనసేన ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు వీరమహిళలు పాల్గొన్నారు.

జగన్‌ను గద్దెదించేందుకు ప్రజలు సిద్ధం

రానున్న ఎన్నికల్లో జగన్‌ను గద్దె దించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ అన్నారు. రామచంద్రపురంలో విలేకరులతో మాట్లాడుతూ వైసీపీకి ఓట్లు వేసేందుకు ఎవరూ సిద్ధంగా లేరన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి పిల్లి సూర్యప్రకాస్ 20వేలు ఓట్ల మెజార్టీతో గెలుపొందుతానని ప్రకటించడం హాస్యాస్పదమన్నారు.

లారీ యూనియన్ సభ్యుల మద్దతు కోరిన సుభాష్

స్థానిక లారీ ఓనర్స్ అసోసియేషన్ భవనంలో లారీ ఓనర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ అసోసియేషన్ సభ్యులను మంగళవారం టీడీపీ అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ కలిశారు. రానున్న ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో లారీ ఓనర్స్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ నాయకులు గన్నమని చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

అరాచక పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడుకుందాం

కె.గంగవరం, మార్చి26: వైసీపీ అరాచక పాలనలో అధోగతి పాలైన రాష్ట్రాన్ని కాపాడుకుందామని టీడీపీ అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ అన్నారు. సోమవారం రాత్రి కూళ్ల, పాణింగపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. కూళ్లలో మాజీ సర్పంచ్ పెంకే గోవిందరాజు ఆధ్వర్యంలో వంద మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. వారికి సుభాష్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. వైసీపీప్రభుత్వంలో సామాన్యుల జీవితాలు దుర్భరంగా మారాయన్నారు. తన గెలుపునకు కృషి చేయాలని, ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటానన్నారు. కార్యక్రమాల్లో మాజీ సర్పంచ్ పెంకే గోవిందరాజు, చిట్టూరి సుబ్రహ్మణ్యం, కొత్తపల్లి మురార్జీ, బలుసు నాగేంద్ర, మేడిశెట్టి రవికుమార్ పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన ఎదుర్లంక సర్పంచ్

ఐ.పోలవరం, మార్చి 26: వైసీపీకి చెందిన ఎదుర్లంక సర్పంచ్ ముదునూరి పద్మఅర్జునరాజు మంగళవారం ముమ్మిడివరం అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు, అమలాపురం పార్లమెంటు అభ్యర్థి గంటి హరీష్ సమక్షంలో టీడీపీలో చేరారు. వైసీపీ పాలనలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలు సహించలేక పార్టీని వీడుతున్నట్టు తెలిపారు. కాగా గోగుల్లంక ఎన్నికల ప్రచారంలో పలువురు వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. వారిని పార్టీ కండువాలతో సత్కరించి బుచ్చిబాబు, హరీష్‌లు టీడీపీలోకి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో మదేటి శ్రీను, ఉంద్రు సూర్యనారాయణ, ఉంద్రు సాయిబాబు, ఉంద్రు నూకరాజు, జనిపెల్ల ఈశ్వరరావు, మాదేటి ధనరాజు, జనిపెల్ల దుర్గాప్రసాద్, ఉంద్రు పెంటయ్య, జగడం అప్పారావు, జగడం దుర్గాప్రసాద్, జగడం అబ్బులు, జగడం లోవరాజు, కురాటి నూకరాజు, దాసరి నూకంభారం, దాసరి లోవరాజు, తిరుకోటి కిశోర్, తిరుకోటి లోవరాజు, తిరుకోటి లోకేశ్, తిరుకోటి బుల్లియ్య, మోర్త రాజ్‌కుమార్, దాసరి చిన్నయ్య, దాసరి శామ్యూల్‌రాజు, ఉంద్రు రాముడు, దాసరి మల్లేశ్వరరావు, దాసరి నూకరాజు, దాసరి శ్రీను, తిరుకోటి నూకరాజు, తిరుకోటి జీవన్, తిరుకోటి చినఅప్పారావు, తిరుకోటి రాజేష్ తదితరులున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టిన లారీ

అంబాజీపేట, మార్చి 26: స్థానిక బస్టాండ్ సమీపంలో లారీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టింది. అంబాజీపేట నుంచి ముక్కామల వైపు వెళ్తున్న లారీ అదుపుతప్పి ప్రక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో స్తంభం విరిగిపోవడంతో పక్కన ఉన్న డ్రైనేజీలోకి లారీ ఒరిగిపోయింది. అక్కడే ఉన్న బొంతుస్వామికి చెందిన ప్రహరీ పాక్షికంగా దెబ్బతింది. విద్యుత్ వైర్లు తెగిపడటంతో సరఫరా నిలిచిపోయింది. వైర్ల వల్ల ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది మరమ్మతులు చేపట్టి సరఫరాను పునరుద్ధరించారు.

సీఐఎస్ఎఫ్ కవాతు

పి.గన్నవరం, మార్చి 26: పి.గన్నవరం శివారు బొడపాటివారిపాలెం, వై.వి.పాలెం, అంబటివారిపాలెం, వై.వి.పాలెం, బెల్లంపూడి, ఉడిమూడి, గంటిపెదపూడి గ్రామాల్లో సీఐఎస్ఎఫ్ సిబ్బంది, సీఐ కె.ప్రశాంత్‌కుమార్, ఎస్ఐ బి.శివకృష్ణ కవాతు నిర్వహించారు. కవాతు నిర్వహించారు. గంటిపెదపూడిలో ఓటు హక్కుపై గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా సహకరించాలని కోరారు. అనంతరం పలు అంశాలపై అవగాహన కల్పించారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ పూజలు

మామిడికుదురు, మార్చి 26: పెదపట్నం గ్రామంలో నిర్మించిన ఆలయంలో సీతారామచంద్ర అంజనేయస్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాశన, దీక్షాధారణ, ప్రధాన మండపారాధన, ధ్వజావరోహణ తదితర పూజా కార్యక్రమాలను పలువురు భక్త దంపతులు కర్తలుగా ఉండి జరిపారు. ఈనెల 28వతేదీ గురువారం ఉదయం 9.36గంటలకు విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమం జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపారు.

ఎన్నికల నియమావళిపై అవగాహన

ద్రాక్షారామ, మార్చి 26: రామచంద్రపురం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో, ఎన్నికల ప్రవర్తనా నియమావళి పర్యవేక్షణ అధికారి రామచంద్రరావు మంగళవారం రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల ఖర్చులపై ఆడిటర్ అప్పారావు విపులంగా పార్టీల ప్రతినిధులకు వివరించారు. కార్యక్రమంలో వైసీపీ తరపున మాజీ జడ్పీటీసీ ఇంత సంతోషం, జనసేన నుంచి ఎస్.శ్రీహరి పంతులు, బీఎస్పీ నుంచి ఎం.సుబ్రహ్మణ్యం, మండల పరిపాలనాధికారి చాగంటి సుబ్రహ్మణ్యం, ఈవోపీఆర్డీ షెలత్ రాజు పాల్గొన్నారు.

క్షమాపణ చెప్పాలి

పి.గన్నవరం, మార్చి 26: వలంటీర్లను ఉగ్రవాదులని పేర్కొన్న శ్రీకాళహస్తి టీడీపీ అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి వలంటీర్లకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని వైసీపీ పి.గన్నవరం అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు డిమాండ్ చేశారు. ఆ వ్యాఖ్యలు దారుణమన్నారు.

ఆర్ఆర్ఆర్‌కు నర్సాపురం సీటు కేటాయించాలి

అమలాపురం టౌన్, మార్చి 26: రాష్ట్రంలో అధికారపక్షంపై ప్రాణాలొడ్డి పోరాటాలు చేయడంతోపాటు పీడిత ప్రజల గొంతుకగా మారిన రఘురామకృష్ణంరాజుకు పార్లమెంటు టిక్కెట్టు కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ ఆర్ఆర్ఆర్ అభిమానులు మంగళవారం రాత్రి అమలాపురం క్షత్రియ కల్యాణ మండపం వద్ద కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన జరిపారు. ఆయనకు నర్సాపురం ఎంపీ టిక్కెట్ కేటాయించాలని డిమాండు చేశారు. నాయకులు దెందుకూరి సత్తిబాబురాజు, చిలువూరి సతీష్‌రాజు, అల్లూరి సోమరాజు, వేగిరాజు శ్రీనురాజు, దంతులూరి వాసురాజు, నడింపల్లి ఉదయబాబు, మంతెన రామరాజు, మార్గాన శ్రీనివాస్, పోతుల నాగరాజు, పిన్నమరాజు గాంధీరాజు, వేగిరాజు ప్రసాదరాజు పాల్గొన్నారు.

పోటీచేసే అభ్యర్థుల కోసం సువిధ యాప్

అమలాపురంటౌన్, మార్చి26: ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల కోసం ఎన్నికల సంఘం సువిధ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందని అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో జి.కేశవర్ధనరెడ్డి తెలిపారు. ఎన్నికలప్పుడు అభ్యర్థులు నామినేషన్ వేసుకునేందుకు ప్రచారానికి అవసరమైన అనుమతులు తీసుకునేందుకు ఈయాప్‌ను వినియోగించుకోవచ్చన్నారు. మంగళవారం ఆయన ఆర్డీవో కార్యాలయంలో డీఎస్పీ ఎం.మహేశ్వరరావుతో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశంనిర్వహించారు. సువిధ యాప్‌ను వినియోగించుకునే విధానంపై అవగాహన కల్పించారు. నాయకులు కారెం వెంకటేశ్వరరావు, బడుగు సత్యనారాయణ, దూరి రాజేష్, పట్టణ సీఐ కె.క్రిస్టఫర్ ఎన్నికల సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

సంక్షేమ సంఘ అధ్యక్షునిగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

అమలాపురం రూరల్, మార్చి 26: శ్రీకోనసీమ దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షునిగా ఊటుకూరి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బండారులంకలో సంఘ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. గౌరవాధ్యక్షునిగా గుంటు ఫణిప్రసాద్, ఉపాధ్యక్షులుగా పిచ్చిక వీర్రాజురవీంద్ర (శ్యామ్), కటకం ధనలక్ష్మీశ్వరరావు, పిచ్చిక పోలిశెట్టి, ప్రధాన కార్యదర్శులుగా పుత్సల వరదరాజులు, గుంటు పాండురంగారావు, చీఫ్ విప్‌గా కాశిన గౌరీమల్లికార్జునరావు, కోశాధికారిగా ద్రైవపు నందయ్య, కార్యదర్శులుగా ములికి విఘ్నేశ్వరుడు, కారుపర్తి గిరిజాపతి, సహాయ కార్యదర్శిగా కామిశెట్టి శ్రీనివాసరావు, మీడియా అధికార ప్రతినిధిగా మాడా రాము, గౌరవ సలహాదారుడిగా చింతా శంకరమూర్తి, అంకం వీర్రాజు, జాన శంకరరావు (బాబ్జీ), చింతా వీరభద్రేశ్వరరావు, చింతపట్ల గంగాసత్యనారాయణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: అనన్య
వెంకటరమణ	: లైన్‌మెన్
శ్రీలలిత	: గామి
శేఖర్ స్ర్కీన్-1	: రజాకార్
శేఖర్ స్ర్కీన్-2	: హనుమాన్
రమా	: ప్రేమలు
గణపతి	: గుంటూరు కారం
వెంకటపద్మావతిస్ర్కీన్-1	: ఓం బీం బుష్
వెంకటపద్మావతి స్ర్కీన్-2	: భీమా

అన్నదాన భవన నిర్మాణానికి రూ.50వేలు విరాళం

ఆత్రేయపురం, మార్చి 26: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి విశాఖపట్నం సీతమ్మదారకు చెందిన గుంటుబోలు ఉమాసాయిప్రసాద్- రజనీ దంపతులు రూ.51వేలు విరాళం సమర్పించారు. మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఆదాయం రూ.1,67,722 లభించినట్టు ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు.

ప్రచార రథాలు ప్రారంభం

రామచంద్రపురం: రామచంద్రపురంలో వైసీపీ ప్రచార రథాలను ఆ పార్టీ అభ్యర్థి పిల్లి సూర్యప్రకాష్ మంగళవారం ప్రారంభించారు. ధపేదారు సెంటర్ నుంచి గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, పట్టణ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, నాయకులు పాల్గొన్నారు.

జల దినోత్సవం

ముమ్మిడివరం, మార్చి 26: ప్రపంచ జలదినోత్సవం సందర్భంగా జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులకు మంగళవారం వకృత్వ పోటీలు నిర్వహించారు. గేదెల్లంక జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయుడు విశ్వేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జనిపల్లి సత్యనారాయణ పాల్గొని మాట్లాడారు. ఈపోటీల్లో 11 మంది విద్యార్థులు పాల్గొనగా విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమలో కేవీవీ సత్యనారాయణ, ఎం.సుజాత, హుస్సేన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైసీపీ సమావేశం

అల్లవరం, మార్చి 26: సీఎంగా జగన్‌ను గెలిపిస్తేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మంత్రి పినిపే విశ్వరూప్ పిలుపునిచ్చారు. అల్లవరం సత్యకస్తూరి కల్యాణ మండపంలో వైసీపీ మండల కన్వీనర్ కొనుకు బాపూజీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, ఎంపీపీ ఇళ్ళ శేషగిరిరావు, జడ్పీటీసీ కొనుకు గౌతమి, బద్రి బాబ్జి, వైస్ ఎంపీపీలు ముత్యాల రామకృష్ణ, వడ్డి గంగా, తిక్కా ప్రసాద్, రుద్రరాజు నానిరాజు, ఏఎంసీ చైర్మన్ దంగేటి డోలామణి పాల్గొన్నారు.

కష్టపడే వారికే గుర్తింపు

మామిడికుదురు, మార్చి 26: పార్టీలో కష్టపడిన వారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమితులైన యిందుకూరి నరసింహరాజు మంగళవారం ఎమ్మెల్యేను కలిశారు. ఆయనను ఎమ్మెల్యే సన్మానించి అభినందించారు.

కట్నం వేధింపులపై కేసు నమోదు

ఆత్రేయపురం, మార్చి 26: ఆత్రేయపురానికి చెందిన యలమర్తి లక్ష్మీభవానికి పశ్చిమగోదావరి జిల్లా సూర్య రావులపాలేనికి చెందిన యలమర్తి వెంకటశివఫణీంద్రసాయితో 2002లో వివాహం జరిగింది. వీరికి సంతానం లేరు. పెళ్లి సమయంలో రూ.5లక్షలు కట్నం, రూ.1.16 లక్షలు ఆడపడుచు కట్నం ఇచ్చారు. ఫణీంద్రసాయి కొంత కాలంగా చెడువ్యసనాలకు బానిసై భార్యను అదనపు కట్నం తెమ్మని మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడు. అత్తమామలు, ఆడపడుచు భర్తకు సహకరిస్తున్నారు. ఈవేధింపులు భరించలేక పుట్టింటికి చేరుకుంది. మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

నేడు వెంకన్న విగ్రహ ప్రతిష్ఠ

అంబాజీపేట, మార్చి 26: ఇసుకపూడి జక్కంశెట్టివారిపాలెంలో బుధవారం శ్రీభూసమేత శ్రీవేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ చేయనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈసందర్భంగా ఆలయం వద్ద వేదపండితులు సుసర్ల బుజ్జి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం భారీ అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు.

ముగిసిన వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాలు

కపిలేశ్వరపురం, మార్చి 26: అంగర శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామివారి దివ్యకల్యాణ మహోత్సవాలు మంగళవారంతో ముగిసాయి. ఆఖరి రోజు మంగళవారం ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. అంగర, పడమరఖండ్రిక గ్రామస్తులు, అధిక సంఖ్యలో వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

ఉమ్మడి అభ్యర్థి సత్యనారాయణకు ఘన స్వాగతం



అయినవిల్లి, మార్చి 26: టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల ఉమ్మడి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణకు మంగళవారం అయినవిల్లిలో ఘన స్వాగతం పలికారు. తొలుత ఆయన అయినవిల్లి శ్రీసిద్ధివినాయకస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. అనంతరం కేశవస్వామి, వీరేశ్వరస్వామి, అన్నపూర్ణాదేవి, కాలభైరవస్వామి ఆలయాలను దర్శించుకున్నారు. టీడీపీ నాయకులు పార్టీ నాయకులను పరిచయం చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు చిట్టూరి శ్రీనివాస్, మండల జనసేన అధ్యక్షుడు పోలిశెట్టి రాజేష్, కల్లేపల్లి సుబ్బరాజు, వారా లక్ష్మీనరసింహ, గుమ్మడి వెంకటేశ్వరరావు, సలాది పుల్లయ్యనాయుడు, మద్దాల సుబ్బారావు, సలాది బుచ్చిరాజు, మట్టపర్తి అచ్యుత్, కముజు రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'రెండు రోజుల్లో భవిష్యత్ నిర్ణయం'

ముమ్మిడివరం, మార్చి 26: జనసేన పార్టీ అభివృద్ధికి చిత్తశుద్ధితో ఎంతో కష్టపడి పనిచేసిన తనకు పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ తనకు టిక్కెట్ కేటాయించకపోవడం అన్యాయమని, తనను ఆ విషయం తీవ్రంగా వేధిస్తోందని జనసేన పార్టీ ముమ్మిడివరం నియోజకవర్గ ఇన్‌చార్జి పితాని బాలకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పవన్‌కల్యాణ్ తాను ఆరాధ్య దైవంగా కొలిచే వ్యక్తి అని, ఆయన తనను అన్యాయానికి గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు మూడు రోజుల్లో భవిష్యత్తు నిర్ణయం ప్రకటిస్తానని బాలకృష్ణ చెప్పారు.

అర్చకుడిపై దాడికి ఖండన

ఆత్రేయపురం, మార్చి 26: కాకినాడలోని శివాలయంలో పనిచేస్తున్న అర్చకుడిపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని బ్రాహ్మణ సంఘం డిమాండ్ చేసింది. మంగళవారం వాడపల్లిలో గాయత్రి బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు శిష్టా సూర్యకుటుంబరావు ఆధ్వర్యంలో అర్చకుడిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు రామం, బాబురావు, ఖండవిల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

అర్చకుడిపై వైసీపీ నేత దాడి దుర్మార్గం

పి.గన్నవరం, మార్చి 26: కాకినాడ దేవాలయం వీధిలోని శివాలయం వద్ద అర్చకులపై వైసీపీ నేత చేసిన దాడి హేయమైన చర్య అని, వైసీపీ నేత దుర్మార్గంగా ప్రవర్తించారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు ఒక ప్రకటనలో మండిపడ్డారు. అర్చకులపై వైసీపీ నేత, మాజీ కార్పొరేటర్ చంద్రరావు చేసిన దాడిని ఆయన ఖండించారు. అర్చకులపై దౌర్జన్యం చేయడం చాలా దారుణమన్నారు. రాష్ట్రంలో వైసీపీ నేతలు చేసే దారుణాలు రోజురోజుకి పెరుగుపోతున్నాయన్నారు.

వైద్య పరీక్షలు

అంబాజీపేట,మార్చి26: మొసలపల్లిలో ముక్కామల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఆరోగ్య వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యాధికారి జి.రమ్యశైలజ ఆధ్వర్యంలో వైద్యులు చైతన్యకుమార్, హసన్ పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సీహెచ్‌వో రవికుమార్, సూపర్‌వైజర్ రాధా, పంచాయతీ కార్యదర్శి చంటి తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు పోలీసుల కౌన్సిలింగ్

మండపేట, మార్చి 26: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రామచంద్రపురం డీఎస్పీ బి.రామకృష్ణ మంగళవారం పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. సత్ప్రవర్తనతో మెలగాలని, నిరంతర నిఘా ఉంటుందని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ అఖిల్‌జమా, ఎస్ఐ హరికోటిశాస్త్రి, అదనపు ఎస్ఐ నాంచారయ్య పాల్గొన్నారు.

తైక్వాండోలో సిద్ధార్థ విద్యార్థుల ప్రతిభ

ఆలమూరు, మార్చి 26: మండపేటలో జరిగిన ఒలింపిక్ గేమ్స్ తైక్వాండో మార్షల్ ఆర్ట్స్ బెల్ట్ గ్రేడింగ్ పోటీల్లో ఆలమూరు శ్రీసిద్ధార్థ హైస్కూల్ విద్యార్థుల ప్రతిభకనబరచి బహుమతులు సాధించారు. ఈపోటీల్లో ప్రతిభకనబరచిన కె.అనుశ్రీ, కార్తీక్, వి.ఎస్.కార్తికేయ, వి.గిరిజా, ఆర్.ఎస్.వి.అఖిల్, జి.జాయ్‌కిరణ్, జి.ఎస్.చైతన్యలు బహుమతులు సాధించారు. విద్యార్థులను స్కూల్ డైరెక్టర్ కె.ముల్లారావు, స్కూల్ ప్రిన్సిపాల్స్ ప్రమోద్‌లాల్, నిర్మలా అభినందించారు.

క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ

యానాం. మార్చి 26: ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం సందర్భంగా యానాం ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి, ఆరోగ్య శాఖ డీడీ డాక్టర్ రవిశంకర్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఆర్ఏ మునిస్వామి ర్యాలీని ప్రారంభించారు. యానాం పురవీధుల్లో విద్యార్థులు ర్యాలీ చేపట్టి, క్షయ వ్యాధిపట్ల ప్రజలకు అవగాహన కలిగించేలా ప్లకార్డులు ప్రదర్శించారు. ర్యాలీలో వివిధ పాఠశాలల విద్యార్థులు, నర్సింగ్ కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

యానాం. మార్చి 26: యానాంలో త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలని యానాం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మునిస్వామి కోరారు. మంగళవారం స్థానిక ఇందిరాగాంధీ మార్కెట్‌లో కళాజాత బృందం ఓటు హక్కు ప్రాముఖ్యం, వినియోగంపై అవగాహన కల్పించారు.

మారెమ్మ అమ్మవారిని దర్శించుకున్న బండారు

కొత్తపేట, మార్చి26: వాడపాలెం గ్రామ దేవత మారెమ్మ అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగామంగళవారం అసెంబ్లీ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి బండారు సత్యానందరావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయన్ను సత్కరించారు. సర్పంచ్ త్సామా బాబు, బండారు వీరబాబు, పప్పుల బుజ్జి, కడియం భాస్కర్ పాల్గొన్నారు.

భక్తులు వాడపల్లి పాదయాత్ర

రావులపాలెం,మార్చి26: రావులపాలెంలో అలివేలుమంగ పద్మావతి అండాళ్ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం అర్చనలు, అభిషేకాలు, అష్టోత్తర, సహస్రనామ పూజలు జరిపారు. భక్తులు, గోవిందమాల ధారులు వాడపల్లి వెంకన్న దర్శనం కోసం పాదయాత్రగా తరలివెళ్లారు.

ఓటు నమోదు చేయించుకోవాలి

రావులపాలెం, మార్చి 26:18ఏళ్లునిండిన వారు ఓటునమోదు చేయించుకోవాలని రెవెన్యూ అధికారి డీవీవీఎస్ అశోక్‌వర్మ కోరారు. స్థానిక విక్టరీ బజార్ గౌడన్ వద్ద మంగళవారం ఆయన ఓటు హక్కుపై అవగాహన కల్పించారు.

ధాన్యం కొనుగోలుపై అవగాహన

రాయవరం, మార్చి 26: రబీ ధాన్యం కొనుగోలుపై రాయవరం రైతు భరోసా కేంద్రం వద్ద రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో సిబ్బందికి మండల స్థాయిలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఏవో కె.ప్రభాకర్ మాట్లాడుతూ మండలంలో 14,447ఎకరాల్లో వరిసాగు జరిగిందని, 55వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశామన్నారు. తహశీల్దారు ఆర్‌వీ కృష్ణారావు మాట్లాడుతూ గోనె సంచులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సీఎస్‌డీటీ ఎలిషా, డిప్యూటీ తహశీల్దారు జానకి రామయ్య, వ్యవసాయ సహాయకులుపాల్గొన్నారు.